రేపటి నుంచి అన్నమయ్య సంకీర్తన మహాయజ్ఞం

చిక్కడపల్లి : ఎస్‌ఏఎస్‌ఎస్‌వీ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంకీర్తన ఆచార్య వేంకటేశ్వర్లు కోటపాటి గోవిందదాస్ స్వరపరచి గానం చేసిన 108 అన్నమయ్య సంకీర్తనతో సంకీర్తన మహాయజ్ఞం నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ పౌండేషన్ చైర్మన్ అనురాధదేవి కోటపాటి తెలిపారు. వివేక్‌నగర్‌లో ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు త్యాగరాయగానసభలో కార్యక్రమం సాయంత్రం 6గంటలకు ప్రారంభమవుతుందన్నారు. 5న కడపరాయ సంకీర్తనలు, 6న అమ్మవారి సంకీర్తనలు, 7న కల్యాణ సంకీర్తనలు, 8న నృసింహ సంకీర్తనలు, 9న శ్రీరామ శ్రీ కృష్ణ సంకీర్తనలు , 10 న విష్ణు సంకీర్తనలు, 11న వైరాగ్య సంకీర్తనలు ఏడు విభాగాలుగా గానం చేస్తారన్నారు.

హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా చేయాల్సిందేనని దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ.. రెండో రాజధాని గురించి ప్రస్తావించింది అంబేద్కరేనని.. ఒకవేళ హైదరాబాద్‌ను రెండో దేశ రాజధానిగా చేయాడాన్ని అడ్డుకుంటే అంబేద్కర్‌ను వ్యతిరేకించినట్లేనని అన్నారు. హైదరాబాద్ రాజధాని అయితే బడ్జెట్ పెరగడంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో జేఏసీ సలహాదారులు చలసాని శ్రీనివాస్, సూర్య ప్రకాష్, ప్రొఫెసర్ తిరుపతి పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం చరిత్రాత్మకం



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కవాడిగూడ : కేంద్ర ప్రభుత్వం కులగణన చేపడతామని చెప్పడం చరిత్రాత్మక నిర్ణయమని బీజేపీ సికింద్రాబాద్ జిల్లా మహంకాళి అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్ అన్నారు. శనివారం ఇందిరాపార్కు చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన సమగ్రంగా చేపడితే అభివృద్ధి ఫలాలు అర్హులైన వారందరికీ దక్కుతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి. రవీందర్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికలను, పాత్రికేయులను ప్రజలు గుర్తించాలి

కాచిగూడ: సమాజంలోని అన్ని వర్గాల అంశాలను నిష్పక్షపాతంగా సమన్వయం చేస్తూ సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న పత్రికలను, పాత్రికేయులను ప్రజలందరూ గుర్తించాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వామన్ రావు అన్నారు. ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 30 సంవత్సరాలకు పైగా పత్రికా రంగంలో విశేష సేవలు అందిస్తున్న సీనియర్ జర్నలిస్టులు జూలూరి రమేష్, గోరిగ రమేష్‌లను ఈ సందర్భంగా జస్టిస్ వామన్‌రావు ఘనంగా సత్కరించి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డులను అందజేశారు.

బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



ప్రధాని మోదీతో ఎంపీ ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి బీసీలకు చట్ట సభలలో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి విజ్ఞప్తి చేశారు. బీసీల డిమాండ్లపై ప్రధానమంత్రిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు శనివారం తెలిపారు. దేశ జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని కులాలకు, సామాజిక వర్గాలకు వారివారి జనాభా ప్రకారం రాజకీయ రంగంలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. దేశ జనాభాలో 56శాతం జనాభా కలిగిన బీసీలకు ఇంతవరకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించకుండా ఈ కులాలను అణిచిపెట్టారని ఆయన తెలిపారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు.

సన్నబియ్యం పంపిణీలో
కేంద్రం సహకారం లేదు



సన్న బియ్యం లబ్ధిదారులతో కలిసి భోజనాలు చేస్తున్న ఎంపీ అనిల్ కుమార్ యాదవ్

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తుంటే, బీజేపీ తమ నిధులతో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారని చెప్పడం సిగ్గుచేటని దమ్ముంటే బీజేపీ పాలిత రాష్ట్రాలలో సన్నబియ్యం పంపిణీ చేసి చూపించాలని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు మందడి అనిల్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను దృష్టిలో పెట్టుకొని సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. శనివారం కవాడిగూడ డివిజన్‌లోని తాళ్ల బస్తీలో లోయర్ ట్యాంక్ బండ్‌లోని ఆయా బస్తీలలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న సన్న రేషన్ బియ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్త మద్దెల ప్రభాకర్ ఇంట్లో సన్న బియ్యంతో వండిన ఆహారాన్ని భుజించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ ఎన్ . అశోక్‌రెడ్డి ,ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విడి కృష్ణ, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోతరాజు భాస్కర్ పాల్గొన్నారు.

టెన్ పిన్ బౌలింగ్ పోటీల్లో రన్నరప్‌గా నగర క్రీడాకారుడు



వివేక్ సింగ్‌ను అభినందిస్తున్న టెన్‌పిన్ బౌలింగ్ ఫెడరేషన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ ఆర్.కన్నన్

కాచిగూడ: దక్షిణ జోన్ టెన్ పిన్ బౌలింగ్ టోర్నమెంట్‌లో కర్ణాటకకు చెందిన కిషన్.ఆర్, హితాషా సిసోడియా విజేతలుగా నిలవగా హైదరాబాద్‌కు చెందిన యువకుడు వివేక్ సింగ్ రన్నరప్‌గా నిలిచాడని తెలంగాణ టెన్‌పిన్ బౌలింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రీధర్ రెడ్డి తెలిపారు. బెంగళూర్‌లోని చర్చ్ స్ట్రీట్‌లోని అమీబా బౌలింగ్ సెంటర్‌లో ఏప్రిల్ 28 నుంచి మే 1వ తేదీ వరకు ఏఆర్సీ సహకారంతో జరిగిన ఈ టోర్నమెంట్‌లో పురుషుల విభాగంలో ఫైనల్‌లో కిషన్ ఆర్ (కర్ణాటక) మొదటి స్థానంలో ఉన్న వివేక్ సింగ్ (తెలంగాణ) పై తలపడి ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో కేవలం 5 పిన్స్ తేడాతో విజయం సాధించాడని తెలిపారు.

మావోయిస్టులతో ప్రభుత్వం చర్చలు జరపాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆదివాసీల హనన్ని ఆపడంతోపాటు మావోయిస్టులతో ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక ఆధ్వర్యంలో శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు నుంచి వీఎస్‌టీ, ఆర్టీసీ క్రాస్ రోడ్డు మీదుగా ఇందిరాపార్కు వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక కన్వీనర్ సాంబమూర్తి మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, కర్రెగుట్టల నుంచి పారా మిలిటరీ బలగాలను ఉపసంహరించుకోవాలని, కాల్పుల విరమణ ప్రకటించాలని మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ లక్ష్మణ్, జర్నలిస్టు రమణ, పల్లె రవికుమార్, జిలుకర శ్రీనివాస్, మచ్చ దేవేందర్, రవిచంద్ర,విష్ణు తదితరులు పాల్గొన్నారు.



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక ర్యాలీ

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



కాచిగూడ: మహిళలు ఏదో ఒక రంగంలో నైపుణ్యం పెంపొందించుకుని ఆర్థికంగా పురోగతి సాధించాలని ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలు పోరండ్ల శారధ ఆధ్వర్యంలో నారాయణగూడ లోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. మహిళా సాధికారతకు తోడ్పడే లక్ష్యంతో ఉచిత కుట్టు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలు గుంటక రూప, ఎలగందుల లలితమ్మ పాల్గొన్నారు.

సుందరీకరణ పనులను వేగవంతం చేయాలి

చిక్కడపల్లి: చౌరస్తాల్లో జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టిన సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అధికారులను కోరారు. శనివారం డివిజన్‌లోని అశోక్‌నగర్‌లో ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులతో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చౌరస్తాల్లో విభిన్న రంగులతో కళాకృతులను ఆకట్టుకునేలా చిత్రీకరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ ఏఈ అబ్దుల్ సలాం, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, నేతలు శ్రీకాంత్, సురేష్ రాజు, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ డివిజన్ అధ్యక్షురాలిగా మాధవి



కాచిగూడ: బీజేపీ హిమాయత్ నగర్ డివిజన్ అధ్యక్షురాలిగా జి.మాధవిని నియమించినట్లు పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా శనివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో లంకల దీపక్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీని మరింత బలోపేతం చేయడానికి పార్టీ కార్యకర్తలు, నేతలను కలుపుకునిపోవాలని సూచించారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ వారిని పార్టీలోకి ఆహ్వానించాలని అన్నారు.

ఘనంగా రామానుజాచార్యుల జయంతి ఉత్సవం



నల్లకుంట: న్యూ నల్లకుంట నర్మదా భవన్‌లోని చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం కేంద్ర కార్యాలయంలో శనివారం భగవత్ రామానుజా చార్యుల 1008వ జయంతి (తిరునక్షత్రోత్సవము) ఉత్సవం ఘనంగా నిర్వహించారు. వకుళాభరణం సంతోషాచార్యుల ఆధ్వర్యంలో పండితుల మంత్రోచ్చారణల నడుమ ఉదయం రామానుజా చార్యులకు అభిషేకము కావించి, ఆరాధన, అష్టోత్తర నామావళి, తిరుపల్లాండు, తిరుపల్లియచ్చి, తిరుప్పావై 'ఇరామను శుత్తన్దారి', పూజలు ద్రావిడోక్తంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవంలో చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్, ఉపాధ్యక్షుడు తులసి సత్యనారాయణ, ఉషారాణి, కార్యదర్శి శ్రీవెంకట యోగి వెంకటేశ్వర్లు, ఆచార్యులు శ్రీమాన్ వకుళాభరణం శ్రవణా చార్యులు, శ్రీకూర్మం రామకృష్ణయ్య పాల్గొన్నారు.

మహిళా మణులకు సత్కారం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వివిధ రంగాలలో సేవలందిస్తున్న పలువురు మహిళా మణులను సత్కరించారు. ఈ సందర్భంగా రాగ రమ్య సంస్థ అధ్యక్షురాలు రమ్య నాయుడు మాట్లాడుతూ సామాజిక మాధ్యమం ద్వారా అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో సామాజిక వేత్త నీరూ ఠాకుర్ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ యువ వికాస్ పథకంలో రాజకీయ జోక్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఆశయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాజీవ్ యువ వికాస్ పథకంలో రాజకీయ జోక్యం లేకుండా అర్హులకు అందించాలని తెలంగాణ రజక వృత్తి దారుల సంఘం ప్రధాన కార్యదర్శి పి. ఆశయ్య డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ ఉచిత విద్యుత్ బిల్లులను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని.. మోడ్రన్ దోబీఘాట్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. ల్యాండ్రీ, సెలూన్ షాపులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎల్ .బాలకృష్ణ మల్లేష్, వెంకటేశ్వర్లు, భూపాల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

EDUCATION SPECIAL Advt.Spl.

ఆది వాగ్గేయకారులు త్యాగరాజస్వామి

చిక్కడపల్లి: కర్ణాటక శాస్త్రీయ సంగీతానికి దిశానిర్దేశనం చేసిన అది వాగ్గేయకారులు త్యాగరాజు స్వామి అని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. శనివారం శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళా వేదికపై జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా త్యాగరాజ స్వామి జయంతి వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలు సాహిత్య ప్రధానం కాగా త్యాగరాయ కీర్తనల్లో సంగీతం పాళ్లు ఎక్కువ అని వివరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో బీజేపీ నాయకుడు వంశీ, గానసభ కార్యవర్గ సభ్యులు బండి శ్రీనివాస్ ద్రవిడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్‌కు 'దాసరి ప్రతిభా అవార్డు



దాసరి ప్రతిభా అవార్డు అందుకుంటున్న నీల శ్రీధర్

కాచిగూడ: దాసరి ఫిల్మ్ అవార్డ్స్ 2025 ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాచిగూడ ప్రాంతానికి చెందిన ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వాసవి ఆర్ట్స్ థియేటర్ అధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్‌కు 'దాసరి ప్రతిభా అవార్డును సినీనటులు మురళీమోహన్, సుమన్ తదితరులు అందజేశారు. డాక్టర్ నీలా శ్రీధర్ గత 35 సంవత్సరాలుగా పలు సామాజిక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతూ వస్తున్నారు. కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి, నటుడు సాయికుమార్, శ్రీరామ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోదీ నిర్ణయం చరిత్రాత్మకం

చిక్కడపల్లి: అణగారిన వర్గాల అభ్యున్నతికి తోడ్పడేందుకే ప్రధాని నరేంద్ర మోదీ చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు అన్నారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి ఆయన ఆ పార్టీ శ్రేణులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న జనగణనతో పాటు కుల గణనను చేపట్టాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

మున్నూరుకాపుల సభ్యత్వ నమోదు ప్రారంభం

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ జీవితకాల సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైందని మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు, ప్రధానకార్యదర్శి మంగళారపు లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్నూరుకాపులు జూన్ 30లోగా తమ సభ్యత్వాన్ని నమోదు చేయించుకోవాలని వారు ఒక ప్రకటనలో కోరారు. కాచిగూడ లోని మహాసభ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బతుకమ్మకుంట అభివృద్ధిలో భాగస్వాములవుతాం



బతుకమ్మకుంట డీపీఆర్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: చారిత్రక బతుకమ్మకుంట అభివృద్ధిలో తాము కూడా భాగస్వాములవుతామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. ఈ చెరువు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందితే పరిసరాలన్నీ ఎంతో ఆహ్లాదకరంగా మారుతాయన్నారు. శనివారం ఎమ్మెల్యేను హైడ్రా అధికారులు మోహన్, నాగరాజు, యూనస్ తదితరులు కలిసి బతుకమ్మకుంట అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డి, అధికారులతో కలిసి అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. చెరువు అభివృద్ధికి సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు(డీపీఆర్)ను పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లోని కాలనీలను దృష్టిలో పెట్టుకొని ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. చెరువులో మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అలాగే చెరువు కట్టపైకి వెళ్లేందుకు తిరిగి వచ్చేందుకు ఉద్దేశించిన ప్రవేశ. నిష్క్రమణ గేట్లను ఒకే దగ్గర నిర్మించి వాటి వద్ద కాపలా ఉంచాలన్నారు. చెరువులోకి వరద నీరు వచ్చేలా మార్గాలను మెరుగుపరచాలన్నారు. అభివృద్ధి పనుల్లో ఏమైనా స మస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.